నేడు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

శంషాబాద్ రూరల్: జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఒయాసిస్ పాఠశాలలో శుక్రవారం జరుగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతారన్నారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ, పరిశోధన సంస్థ ప్రకటించిన 'సుస్థిర భవిష్యతు నిర్మాణంలో శాస్త్ర, సాంకేతికత పాత్ర' అనే ప్రధానంశంపై పలు రకాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

శంషాబాద్: మున్సిపల్ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభలను డిసెంబర్ 28వ తేదీన శంషాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికులతో ఏళ్లుగా ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తూ తగిన వేతనాలను చెల్లించడం లేదన్నారు. సంఘటిత పోరాటాలతో హక్కులను సాధించుకునేందుకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

శంషాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. పెండింగ్‌లు బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు రాకపోవతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళనను కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో జయమ్మ, లావణ్య, సావిత్రి, శిరీష, భారతమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ కార్యాలయ భవనం



కమ్యూనిటీ హాల్ భవనం

'అభివృద్ధి'.. పూర్తయ్యేనా?

మణికొండ: అవి మున్సిపాలిటీకే మంచి పేరు తెచ్చే అభివృద్ధి పనులు. వాటిని సకాలంలో పూర్తి చేసి ఇప్పటికే ప్రారంభోత్సవాలు చేయాలి. అలాంటిది సంవత్సరాలు గడిచినా అందుకు సంబంధించిన పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. మరో రెండు నెలల్లో మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం పూర్తికానుంది. ఆలోగానైనా ఆయా పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- మణికొండ మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఏడాది క్రితం దానికి సమీపంలోనే తెలంగాణ క్రీడా ప్రాంగణం, మణికొండ గ్రామ కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించారు. ఆ పనులు ఆరు నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటి వరకు సగం పనులు సైతం పూర్తి కాలేదు. వీటితో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే పనులు మొదలైన పార్కులు, డ్రైనేజీలు, రోడ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటన్నింటినీ రాబోయే రెండు నెలల్లోనైనా పూర్తి చేయాలని పలు కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తీర్మానాలకే పరిమితం..

రూ. కోట్ల నిధులు ఉన్న మణికొండ మున్సిపాలిటీలో ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంటుంది. అలాంటొపనులను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా ప్రజాప్రతినిధుల వారీగా నిధులను పంపకాలు చేయటంతో అసలు పనులు పెండింగ్‌లో పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు



క్రీడా ప్రాంగణం

కొనసా...గుతున్న వివిధ పనులు

- పట్టించుకోని అధికారులు పాలకులు
- గడువులోగా పూర్తయ్యేనా అనే అనుమానాలు

పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ కార్యాలయం పనులకు ముందుగా రూ. 5 కోట్లు కేటాయించారు. అవి కాస్తా లెవలింగ్ పనులకే అయిపోయాయని తిరిగి మరో రూ. 4 కోట్లను కేటాయించాలని తీర్మానించారు. ఆ పనులు చేపట్టేందుకు ఎస్ఈ స్థాయిలో అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఎస్ఈకి దస్త్రం పంపి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. పనులను అనుమతులు ఎపుడు వస్తాయో.. పూర్తి ఎపుడు అవుతాయో.. ప్రస్తుత పాలకవర్గం ఒకరోజైనా అందులో కూర్చుంటారో లేదో అని అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

నత్తనడకన స్టేడియం పనులు...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో క్రీడా ప్రాంగణం ఉండాలని నిర్ణయించింది. దాంతో ల్యాంకోహిల్స్ పక్కన ఏడు ఎకరాల భూమిని దానికి కేటాయించి పనులను మొదలు పెట్టి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు సైతం పూర్తి కాలేదు. పర్యవేక్షణ ఎక్కువ.. పనులు తక్కువ అనే రీతిన తయారైంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించినా పనులు మాత్రం రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కిలా కొనసాగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. మణికొండ గ్రామానికి చెందిన కమ్యూనిటీ హాల్ పనులు ప్రస్తుతం అరకొరగా కొనసాగుతున్నా పాలకవర్గం దిగి పోయేలోపు పూర్తయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిధుల మంజూరుకు కృషి



మణికొండ గ్రామ కమ్యూనిటీ హాల్‌కు మరో రూ. కోటి, క్రీడా ప్రాంగణానికి రూ. 2 కోట్ల నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది. రాబోయే సమావేశంలో ఆ విషయాన్ని కమిషనర్ చైర్మన్, తోటి కౌన్సిలర్‌ల దృష్టికి తెచ్చి మంజూరు అయ్యేలా కృషి చేస్తా. ఈ పనులు మున్సిపాలిటీకి ఎంతో పేరు తెచ్చే పనులు. వాటిని సకాలంలో పూర్తి చేయటంలో ఇప్పటికే విఫలం అయిన విషయం వాస్తవం. రాబోయే రెండు నెలల్లో వాటిని పూర్తి చేసి ప్రారంభించేలా చూస్తాను.

– బి.శ్వేతరవికాంత్‌రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్

ఎస్ఈని కలిసి అనుమతులు తెస్తాం



మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు క్రీడా ప్రాంగణం, పలు పార్కులు, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఇప్పటికే తీర్మానాలు చేసిన వాటిని అనుమతుల నిమిత్తం ఎస్ఈకి పంపించాం. ఆయన నుంచి వారం రోజుల్లో అనుమతులు తెచ్చి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసుందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పూర్తి అయి ఉన్న కొన్ని కమ్యూనిటీ హాల్‌లు, పార్కులు, రోడ్లను డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చార్మినార్ సీబీడీ ఏడీఈ తెలిపారు. ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలోని సంజీవని హిల్స్, నలందనగర్, సిరిమల్లేనగర్, ఏజీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలోని కేశవ్‌నగర్, కృష్ణానగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వివరించారు.

కళాశాల మేనేజర్‌ను బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడు నాగారం ప్రశాంత్

మణికొండ: కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు ఇవ్వాలని లేదంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయటంతో పాటు దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్న నాగారం ప్రశాంత్‌ను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... తమను డబ్బులు, కళాశాలలో సీట్లు ఇవ్వాలని వేధిస్తున్న ప్రశాంత్‌పై చర్యలు తీసుకోవాలని సీవీఆర్ కళాశాల మేనేజర్ శ్రీపతి నారాయణరెడ్డి నార్సింగి పోలీసులకు ఈ నెల 16వ తేదీన ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అతను ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉండగా గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాంతో కోర్టు అతనికి 24 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించిందన్నారు. ఇలాంటి దోపిడీలు, బెదిరింపులకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

ఏజీ వర్సిటీలో ఆర్గానిక్ పెస్టిసైడ్ ఆవిష్కరణ



ఆర్గానిక్స్ పెస్టిసైడ్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అగ్రికల్చర్ హబ్‌లో జీపీ ఏవెన్స్ సంస్థ తయారు చేసిన థ్రిప్స్ క్లియర్ అనే ఆర్గానిక్ మెటబాలైట్ సమ్మేళనాన్ని పీజేటీఏయూ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ రఘురామిరెడ్డి, డిక్కి జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కె.రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ఆర్గానిక్స్ మందు ద్వారా మిర్చి రైతులు నల్ల తామర పురుగు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దాదాపు మూడేళ్లు అనేక పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు గాజుల ప్రభాకర్, నరేంద్రకుమార్ ఈ మందును అభివృద్ధి చేశారంటూ వారిని అభినందిచారు. ఈ పెస్టిసైడ్‌ను వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ స్థాయిల్లో లేబొరేటరీ క్షేత్ర స్థాయిలో పరీక్షలు చేసి నిర్ధారించామన్నారు. ఇది రైతులకు చాలా మేలు చేసేలా ఉందని తెలిపారు. ఏజీ హబ్ ఎండీ డాక్టర్ కల్పనా శాస్త్రి, సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శైలజ, ఏజీ హబ్ సీఈఓ విజయ్, సీసీఎంబీ సైంటిస్టు డాక్టర్ రాంజీ, ఐకేపీ ఎన్నోవేషన్ మేనేజర్ దేదీప్య, ఉస్మానియా యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ మంచాల లింగస్వామి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ వాహనాన్ని ఢీకొన్న కారు: ఇద్దరికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చేటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... దుర్గా కన్వెన్షన్ ఎదురుగా జీహెచ్ఎంసీ బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను రెడీమిక్స్ వాహనంతో కాంక్రీట్ పనులు జరుతున్నాయి. గురువారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఉడంగడ్డ నుంచి వేగంగా ఆల్టో కారు వచ్చి రెడీమిక్స్ వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం యువకులను దవాఖానాకు తరలించారు. కారులో మద్యం సీసాలు ఉండటంతో మద్యం సేవించి కారు నడిపినట్లు అనుమానిస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

గోల్కొండ: మెహిదీపట్నం, టోలీచౌకీ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్, మాజీద్ హుస్సేన్ నగర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వారు సీవీ ఆనంద్‌ను కలిశారు. ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ప్రతినిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. మెహిదీపట్నం, నానల్‌నగర్, టోలీచౌకీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని వారు కమిషనర్‌కు వివరించారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయని, బల్దియా వారితో కలిసి రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించి సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలంటే అంతర్జాతీయ సదస్సులు అవసరం

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి సాధించాలంటే అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ అవశ్యమని కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా వైస్‌చైర్మన్ డాక్టర్ నూతన్‌కుమార్ దాస్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో రెండు రోజుల 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇంజనీరింగ్, సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణల అవశ్యకత' అంశంపై ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఇంజనీరింగ్, సాంకేతికత రంగంలో నూతన ఆవిష్కరణల ఆవశ్యకత, ప్రతిపాదనలు చేయడానికి సదస్సుల ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. 2030 నాటికి లక్ష్యాలను సాధించాలంటే అంతర్జాతీయ సమావేశాల అవసరం ఉందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ వివిధ సెమినార్ల నిర్వహణ ద్వారా పలు ఇంజనీరింగ్ అంశాలపై సంబంధిత శాఖలకు సూచనలు, సలహాలు ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ అసోసియేట్ సభ్యులు కార్పొరేట్ సభ్యులు పి.ఎం.గుణరాజు, ఎం నాగరాజు, డాక్టర్ చౌడేగౌడ్, డాక్టర్ ఎస్ సత్యనారాయణ, సూర్యప్రకాశ్, డాక్టర్ ఐఎస్ఎన్‌రాజు, డాక్టర్ ఎస్ నాగభూషణరావు, ఉదయకృష్ణ, బ్రహ్మారెడ్డి, డాక్టర్ హనుమంతాచారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన స్మార్ట్ లివింగ్, సేఫ్ ఇండియా ర్యాలీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపించరాదన్నారు. అలా ఇస్తే తల్లిదండ్రులతో పాటు వారి పిల్లలపై కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత సెబాస్టియన్, డీన్ బి.శ్రీనివాస్, సైబరాబాద్ ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎస్ఐ గురువయ్య, శ్రీచైతన్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంని గురువారం రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, కార్తీక్ రెడ్డి, కోలన్ సుభాష్ రెడ్డి, పోరెడ్డి ధర్మా రెడ్డి, కృష్ణమాచారి, సత్యనారాయణ ముదిరాజ్, జాలిగం చిత్తారి, రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తా

గోల్కొండ: మహిళల సమస్యలు పరిష్కరించడం, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక సేవా కేంద్రాలు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం టోలీచౌకిలోని తన కార్యాలయంలో ఆయన ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన పలువురు మహిళలతో మాట్లాడారు. ఈ కేంద్రాలలో కుటుంబ సమస్యల పరిష్కారం, దంపతుల మధ్య కలహాలు పరిష్కరించడంతో పాటు మహిళల సాధికారత కోసం సలహాలు, సూచనలు ఉచితంగా ఇస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆయేషా బేగం ఆధ్వర్యంలో ప్రతి కేంద్రానికి ఒక మహిళను, మహిళల కమిటీని



మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలలో ఈపాటికే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సమీనా, సల్మా, మసూద్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

శంషాబాద్ రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మండలంలోని పిల్లోనిగూడ వాసి కార్తీక్‌కు మంజూరైన చెక్కును గురువారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పంపిణీ చేశారు. నాయకులు నర్సింహా, రమేష్, శ్రీశైలం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగం, ఆలిండియా నహ్జల బలాఘా సొసైటీ సహకారంతో గురువారం అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఇరాన్‌కు చెందిన ఆధ్యాత్మిక, విద్యావేత్త, రచయిత ఆయాతుల్లా మహదీ మహదవిపూర్ మాట్లాడుతూ నహ్జల్ బలాఘా యొక్క బోధనలు, సాంస్కృతిక ప్రాముఖ్యత గురించి చర్చించడానికి నిష్ణాతులు, ప్రముఖులను ఒక చోట చేర్చడానికి 'మనూ' చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం నహ్జల్ బలాఘా రచించిన రెండు పుస్తకాలను' ఆవిష్కరించారు.

యువకుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: పని కోసం వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నర్కూడకు చెందిన గూడెపు నిఖిల్(25) డ్రైవింగ్ చేసేవాడు. ఈ నెల 26న డ్రైవింగ్ కోసం కొండాపూర్ వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా అచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురుగుకాలువలో పడి వ్యక్తి మృతి



గచ్చిబౌలి: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి డ్రైనేజీ కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 27వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్రాడ్‌వే కంపెనీ సమీపంలో ఓ వ్యక్తి(42- 45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి డ్రైనేజీ కాలువలో పడి పోయాడు. గురువారం ఉదయం 11.30 గంటలకు నాలాలో పడి వ్యక్తి మృతి చెంది ఉన్నాడని డయల్ 100కు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాలకృత్యాలు తీర్చుకునే యత్నంలో ప్రమాద వశాత్తు నాలాలో పడి పోయినట్లు సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే 9490617127 ఫోన్ నంబర్ లేదా గచ్చిబౌలి పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

మాలల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని మాల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మాలల సింహ గర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... మాలల సింహా గర్జన మహాసభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు శ్రీధర్, బల్వంత్, పచ్చ శ్రీను, పచ్చ నర్సింగ్ రావు, మంత్ర చంద్రశేఖర్, పంబల రాజు, గొడుగు సంజీవ, పత్యార నరసింహా, పెండ్యాల జంగయ్య, ఏర్పుల కుమార్, శంకర్, యాదయ్య, కార్తీక్, నాని, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ



మణికొండ: అయ్యప్ప నామ స్మరణలతో మణికొండ శివాజీనగర్ కాలనీ మారుమోగింది. గురువారం గురుస్వామి అర్జున్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మహాపడిపూజను నిర్వహించారు. గురుస్వామి వేదాంత్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజలో నార్సింగి నర్సింగ్‌రావు భజన బృందం పాడిన భక్తి పాటల నడుమ పూజ కొనసాగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన (భిక్ష) కార్యక్రమంలో అయ్యప్ప మాలాధారులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గురుస్వాములు రాజేందర్‌గౌడ్, బి.సాయిరెడ్డి, యాలాల నరేష్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, కౌన్సిలర్‌లు కె.రామకృష్ణారెడ్డి, డి.పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణ, నాయకులు బి.శ్రీరాములు, కిరణ్ కుమార్, తమోదన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

మణికొండ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సరే నెంబర్ 132లోని ప్రభుత్వ భూమిలో ఇటీవల కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం తెలిసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వాటిని తొలగించాలని ఆదేశించారు. దాంతో గురువారం ఆర్ఐలు విక్రంరెడ్డి, సురేష్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తగా వచ్చిన పది వరకు నిర్మాణాల బేస్‌మెంట్లను తొలగించారు. ఈ సందర్భంగా పలువురు నిర్మాణ దారులు తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని, వాటికి ఇప్పటి వరకు స్థలాలు చూపకపోవటం, పలుమార్లు నిర్మాణాలు చేపట్టేందుకు యత్నిస్తే అడ్డుకు



న్నారని అధికారులతో వాదనకు దిగారు. దాంతో అక్కడకు చేరుకున్న తహసీల్దార్ ఆ నిర్మాణాలను నేలమట్టం చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరింరు. మరోసారి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.